



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
. PM




## మాజీ సీఎం కేసీఆర్‌కు గాయం..
# యశోద ఆస్పత్రిలో చికిత్స

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఆస్పత్రిలో చేరారు. కాలుజారి పడటంతో ఆయనకు గాయమైంది. దీంతో గురువారం అర్ధరాత్రి సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో కేసీఆర్‌ను చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆయనకు తుంటి ఎముక విరిగినట్లు వైద్యులు గుర్తించారు. శస్త్ర చికిత్స నిర్వహించాల్సి రావొచ్చని భావిస్తున్నారు. అయితే వైద్య పరీక్షలు పూర్తయ్యాక శస్త్రచికిత్సపై వైద్యులు నిర్ణయం తీసుకోనున్నారు.

**కేసీఆర్ త్వరగా కోలుకోవాలి: ప్రధాని మోదీ**

కేసీఆర్‌కు గాయం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. ఆయన పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రధాని ట్వీట్ చేశారు.

**అందరి ప్రార్థనలతో కేసీఆర్ త్వరలోనే కోలుకుంటారు: ఎమ్మెల్సీ కవిత**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యంపై ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత స్పందించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో కేసీఆర్ చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు కవిత ట్వీట్ చేశారు. కేసీఆర్‌కు స్వల్ప గాయమైందని.. వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని తెలిపారు. అందరి ప్రార్థనలతో కేసీఆర్ త్వరలోనే కోలుకుంటారని కవిత పేర్కొన్నారు.

**కేసీఆర్‌కు ఇవాళ సాయంత్రం సర్జరీ**

మాజీ సీఎం కేసీఆర్ కాలికి గాయం కావడంతో హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఇవాళ సాయంత్రం హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయనున్నట్లు వైద్యులు వెల్లడించారు. అంతకుమందు కేసీఆర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించగా.. ఆయన కాలు తుంటి ఎముక విరిగినట్లు గుర్తించారు. కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లోని బాత్‌రూంలో కాలు జారీ కిందపడటంతో.. గాయపడ్డారు.

**ఆస్పత్రిలో కేసీఆర్ .. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు**

మాజీ సీఎం కేసీఆర్ కాలికి గాయం కావడంతో హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. యశోద ఆస్పత్రి వద్ద భద్రత పెంచాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు యశోద ఆస్పత్రి వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.



# సీఎం రేవంత్ రెడ్డి
# తొలి ప్రజా దర్బార్
## భారీగా తరలి వచ్చిన ప్రజలు
## స్వయంగా వినతులు స్వీకరించిన సీఎం రేవంత్

తెలంగాణ ముఖ్యమంత్రిగా గురువారం ప్రమాణస్వీకారం చేసిన రేవంత్ రెడ్డి దూకుడు ప్రదర్శిస్తున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జ్యోతిరావు పూలే ప్రజాభవన్ (ప్రగతి భవన్)లో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు పాల్గొన్నారు. సామాన్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌కు సామాన్యులు తరలి వచ్చారు. తమ సమస్యలను వివరించారు. ధరణి సమస్యలు, తమ భూములు నేతలు కబ్జాలు చేశారని, డబుల్ బెడ్ రూంలు ఇప్పించాలని, అడ్వకేట్ రైట్స్ యాక్ట్ రూపకల్పన చేయాలని, టీచర్ 317 జీవో ఇవ్వాలని కోరారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిని కలవడానికి కొంత మంది కాంగ్రెస్ కార్యకర్తలు వచ్చారు. కాగా ప్రజాదర్బార్ కార్యక్రమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంతవాహనంలోనే జూబ్లీహిల్స్‌లోని నివాసం నుంచి ప్రజా దర్బార్‌కు చేరుకున్నారు. అనంతరం ప్రజాభవన్‌లో ప్రజా దర్బార్ మొదలైంది. సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొన్నారు. ప్రజల నుంచి నేరుగా అర్జీలను సీఎం రేవంత్, మంత్రులు స్వీకరించారు. మరోవైపు ప్రజాదర్బార్‌కు మంచి స్పందన లభిస్తోంది. రాష్ట్ర నలుమూల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజాభవన్‌కు భారీగా ప్రజలు చేరుకున్నారు. తమ సమస్యలు నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్తే పరిష్కారం అవుతాయని బాధితులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


















## ఐదోసారి వడ్డీరేట్లు యథాతథం..
## వృద్ధిరేటు అంచనాల పెంపు

కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతున్నట్లు 'భారతీయ రిజర్వ్ బ్యాంక్' గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం వెల్లడించారు. దీంతో రెపోరేటు 6.5 శాతం వద్ద స్థిరంగా కొనసాగనుంది. కీలక రేట్లలో ఎలాంటి మార్పు చేయక పోవడం వరుసగా ఇది ఐదోసారి. బుధవారం ప్రారంభమైన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలను శక్తికాంత దాస్ శుక్రవారం ప్రకటించారు.



## మెడికల్ కాలేజీలో 24 గంటల్లో
## తొమ్మిది మంది శిశువుల మృతి

పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా మెడికల్ కాలేజీలో 24 గంటల్లో 9 మంది చిన్నారులు చనిపోయారు. ఇంకా చాలా మంది నవజాత శిశువుల జీవితాలు ప్రమాదంలో ఉన్నాయని చెప్పారు. వైద్య కళాశాలలోని ఎస్ఎన్‌సీయూ విభాగంలో నవజాత శిశువులు మృతి చెందారు. ఇంత పెద్ద సంఖ్యలో నవజాత శిశువులు ఏకకాలంలో చనిపోవడంతో పశ్చిమ బెంగాల్ ఆరోగ్య వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బాధితురాలి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆసుపత్రి నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు సూటిగా ఆరోపిస్తున్నారు. జిల్లాలోని జంగీపూర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పిల్లల ఆసుపత్రి. పెద్ద సంఖ్యలో నవజాత శిశువులు చికిత్స కోసం ఇక్కడ చేరారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో ప్రైవేటు ఆసుపత్రులు తెరుచుకున్నాయి. నవజాత శిశువుల ఆరోగ్య పరిస్థితి అదుపు తప్పినప్పుడు. అప్పుడు ఈ చిన్న ఆసుపత్రులు వారిని మెడికల్ కాలేజీలకు పంపుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో ముర్షిదాబాద్ మెడికల్ కాలేజీలో రోజురోజుకూ ఒత్తిడి పెరుగుతోంది. ఎస్ఎన్‌సీయూలో 52 పడకలు ఉన్నాయని ఆస్పత్రి యాజమాన్యం చెబుతోంది. మూడు పిల్లలను ఒక మంచం మీద ఉంచారు. ఇక్కడ 100 మందికి పైగా పిల్లలు ప్రవేశం పొందుతున్నారు. ఆసుపత్రి ప్రిన్సిపాల్ అమిత్ దాన్ మాట్లాడుతూ.. తనకు ఇప్పటికే ఓ కమిటీ ఉందన్నారు. ఈ ఘటనలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



## విద్యుత్‌పైనే తొలి గురి!
### ఆ శాఖ కార్యదర్శిపై సీఎం ఆగ్రహం

రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ పనితీరుపై వాడి వేడిగా చర్చ సాగింది. విద్యుత్ రంగంలో ఏం జరిగిందో తెలుపుతూ సమగ్రంగా శ్వేతపత్రం విడుదల చేయాలని మంత్రివర్గం అభిప్రాయపడింది. ఆ శాఖలో వాస్తవాలను వెల్లడించకుండా చాలాకాలంగా దాచిపెట్టడాన్ని తప్పుపడుతూ.. ఆ శాఖ ఉన్నతాధికారిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విద్యుత్ సంక్షోభం తెచ్చేలా కుట్ర జరిగిందని రేవంత్ అభిప్రాయపడినట్లు సమాచారం. విద్యుత్ సంస్థలకు ఇప్పటివరకు రూ.85 వేల కోట్ల అప్పులున్నట్లు సీఎంకు అధికారులు చెప్పారని తెలుస్తోంది. శుక్రవారం దీనిపై సమీక్ష చేద్దామని అంటూ.. ఆ శాఖకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధం కావాలని రేవంత్ ఆదేశించినట్లు సమాచారం. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేశారు. దాన్ని ఆమోదించవద్దని.. శుక్రవారం నాటి సమీక్ష సమావేశానికి ఆయనను కూడా పిలవాలని సీఎం ఆదేశించారు.

## ప్రజల కష్టాలు ఇక
## మూడు నెలలే
### చంద్రబాబు

వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. గుంటూరు జిల్లా రేవేంద్రపాడులో తుపాను బాధిత రైతులను ఆయన పరామర్శించారు. "నేను పర్యటనకు వస్తున్నానని హడావుడిగా జగన్ బయల్దేరారు. పొలాల్లో ఉండి రైతుల కష్టాలు తెలుసుకోవాల్సిన మంత్రులెక్కడ? కనీసం పంట బీమా ప్రీమియం కూడా చెల్లించలేని దుస్థితి. ప్రజల కష్టాలు ఇక మూడు నెలలే." అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.





## ప్రొటెం స్పీకర్ ఎవరనేదానిపై ఆసక్తికర చర్చ

రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో తొలి సమావేశాలకు ప్రొటెం స్పీకర్‌గా ఎవరు వ్యవహరిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. కొత్తగా ఎన్నికైన సభ్యులతో మొదటగా ప్రమాణ స్వీకారం చేయించి స్పీకర్‌ను ఎన్నుకునేంత వరకు ప్రొటెం స్పీకర్ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. సాధారణంగా ఎక్కువసార్లు శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తారు. ప్రస్తుతం అత్యధికంగా ఎనిమిది సార్లు ఎన్నికైన శాసన సభ్యులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నారు. భారాసకు చెందిన ఇతర సభ్యుల్లో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆరుసార్లు ఎన్నికైన శాసనసభ్యులు. కాంగ్రెస్‌లో ఆరుసార్లు ఎన్నికైన ఎమ్మెల్యేలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులు ఇద్దరూ మంత్రులుగా నియమితులయ్యారు. ఎంఐఎం పార్టీకి చెందిన ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఆరుసార్లు శాసన సభకు ఎన్నికయ్యారు. ఈ పరిస్థితుల్లో ఎవరు ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

**తెలంగాణ ప్రొటెం స్పీకర్‌గా కేసీఆర్?**

కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణం చేయించేందుకు.. ఎక్కువసార్లు శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తారు. ప్రస్తుతం ఉన్నవారిలో కేసీఆర్ అత్యధికంగా ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ నేపథ్యంలో ప్రొటెం స్పీకర్‌గా ఉండాలని కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కోరితే.. ఆయన అంగీకరిస్తారా? లేదా? కాలికి గాయం కావడంతో అసెంబ్లీకి రాలేరా? అనేది చర్చనీయాంశంగా మారింది.




## 10 కీలక ప్రయోగాలు చేపట్టనున్న ఇస్రో


వరుస విజయాలతో ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు అందుకుంటున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వచ్చే ఏడాది కీలక ప్రయోగాలకు సిద్ధమవుతోంది. 2024లో ముఖ్యమైన 10 ప్రయోగాలు చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభకు వెల్లడించింది. ఇందులో 6 పీఎస్ఎల్వీ ప్రయోగాలతోపాటు 3 జీఎస్ఎల్వీ, ఒక లాంచ్ వెహికల్ మార్క్-3 మిషన్ ఉన్నట్లు తెలిపింది. సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఈ మేరకు రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. అంతేకాకుండా ఇస్రో అభివృద్ధి చేసిన సరికొత్త ప్రయోగ వాహక నౌక ఎస్ఎస్ఎల్వీ (స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్) ద్వారా ప్రయోగాత్మకంగా ఓ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపించనున్నట్లు ఆయన తెలిపారు. రోదసిలోకి సొంతంగా వ్యోమగాములను పంపేందుకు 'గగన్‌యాన్' పేరిట భారత్ ప్రతిష్ఠాత్మక మిషన్‌ను చేపడుతున్న విషయం తెలిసిందే. అత్యవసర పరిస్థితుల్లో గగన్‌యాన్‌లోని వ్యోమగాములు సురక్షితంగా బయటపడేందుకు వీలుగా అభివృద్ధి చేసిన 'క్రూ ఎస్కేప్ సిస్టమ్'ను ధ్రువీకరించేందుకు మరో ప్రయోగం చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు.



## విదేశాల్లో 403 మంది భారత విద్యార్థులు మృతి

గత ఐదేళ్లలో వివిధ కారణాల వల్ల విదేశాల్లో 403 మంది భారతీయ విద్యార్థులు మరణించారని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించింది. కెనడాలో 91 మంది మరణించారు. యూకేలో 48 మంది, రష్యాలో 40 మంది, అమెరికాలో 36 మంది, ఆస్ట్రేలియాలో 35 మంది, ఉక్రెయిన్‌లో 21 మంది, జర్మనీలో 20 మంది, సైప్రస్‌లో 14 మంది, ఇటలీ, ఫిలిప్పీన్స్‌లో ఒక్కొక్కరు 10 మంది విద్యార్థులు మరణించారని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com



## తమిళనాడు, కర్ణాటకల్లో భూకంపం.. భయంతో పరుగులు తీసిన జనం

కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ రోజు తెల్లవారుజామున భూ ప్రకంపనలు వచ్చాయి. తమిళనాడులోని ఉత్తర జిల్లాలో శుక్రవారం 3.2 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ తెలిపింది. NCS ఇచ్చిన సమాచారం ప్రకారం.. శుక్రవారం ఉదయం కర్ణాటకలోని విజయపుర జిల్లాలో కూడా భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 3.1గా నమోదైంది. శుక్రవారం ఉదయం 6:52 గంటలకు కర్ణాటకలోని ప్రాంతంలో భూకంపం సంభవించింది. భూకంప కేంద్రం 16.77 అక్షాంశం, 75.87 రేఖాంశంలో ఉందని, 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు సంభవించాయని ఎన్‌సిఎస్ తెలిపింది. ప్రస్తుతం ఎలాంటి నష్టం జరగలేదు.

### భూకంపం వస్తే ఏం చేయాలి ?

భూకంపం సంభవించినప్పుడు మీరు ఇల్లు, కార్యాలయం లేదా ఏదైనా భవనంలో ఉన్నట్లయితే, అక్కడ నుండి బయటకు వచ్చి బహిరంగ ప్రదేశంలోకి రండి. దీని తరువాత బహిరంగ మైదానం వైపు పరుగెత్తండి. భూకంపం సమయంలో బహిరంగ మైదానం కంటే సురక్షితమైన ప్రదేశం లేదు. భూకంపం సంభవించినప్పుడు ఏ భవనం దగ్గరా నిలబడకండి. మీరు లిఫ్ట్ ఉన్న భవనంలో ఉంటే.. లిఫ్ట్‌ను అస్సలు ఉపయోగించవద్దు. మెట్లు ఉపయోగించడం మంచిది. భూకంపం సంభవించినప్పుడు ఇంటి తలుపులు, కిటికీలు తెరిచి ఉంచండి. ఇది కాకుండా ఇంట్లో ఉన్న అన్ని విద్యుత్ స్విచ్‌లను ఆఫ్ చేయండి. భవనం చాలా ఎత్తులో ఉంటే, వెంటనే దిగడం సాధ్యం కాకపోతే, భవనంలో ఉన్న టేబుల్, ఎత్తైన స్టూల్ లేదా మంచం కింద దాక్కోండి. భూకంపం సంభవించినప్పుడు, ప్రజలు భయాందోళనలకు గురికాకుండా జాగ్రత్త వహించాలి. ఎలాంటి పుకార్లు వ్యాప్తి చెందకుండా ఉండాలి.



## ఉల్లి ఎగుమతులపై కేంద్రం నిషేధం..

దేశంలో ఉల్లి ధరలు మళ్లీ మండిపోతున్నాయి. చాలా రాష్ట్రాల్లో కిలో ఉల్లి కనీస ధర రూ.50 పైనే పలుకుతోంది. దీంతో వీటి ధరల కట్టడికి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. 2024 మార్చి 31 వరకు ఉల్లి ఎగుమతులపై నిషేధం విధించింది. ఈ మేరకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశీయంగా ఉల్లి అందుబాటులో ఉంచడంతో పాటు ధరలు అదుపు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. శుక్రవారం (డిసెంబరు 8) నుంచే ఈ నిషేధం అమల్లోకి వస్తున్నట్లు తెలిపింది. అయితే, ఇందులో కొన్ని మినహాయింపులు కల్పించింది. ఈ నోటిఫికేషన్‌కు ముందే ఓడల్లో లోడ్ అయిన ఉల్లిని, ఇప్పటికే కస్టమ్స్‌కు అప్పగించిన ఉల్లి లోడ్‌ను ఎగుమతి చేసుకోవచ్చని DGFT వెల్లడించింది. అయితే, ఇతర దేశాల అభ్యర్థనల మేరకు భారత ప్రభుత్వం అనుమతిస్తే.. ఆయా దేశాలకు ఉల్లి ఎగుమతులు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. దేశీయ మార్కెట్లలో ఉల్లి ధరలను అదుపు చేసేందుకు ఇటీవల కేంద్రం పలుమార్లు ఎగుమతుల పాలసీని సవరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఆగస్టులో ఉల్లి ఎగుమతులపై 40శాతం కస్టమ్స్ సుంకాన్ని విధించింది. ఆ తర్వాత అక్టోబరులో దాన్ని సవరిస్తూ.. ఉల్లికి కనీస ఎగుమతి ధరను 800 డాలర్లుగా నిర్ణయించింది. తాజాగా ఎగుమతులపై నిషేధం అమల్లోకి తెచ్చింది.



## రజనీకి కాంట్రాక్ట్ ఉద్యోగం ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్ నాంపల్లికి చెందిన దివ్యాంగురాలు రజనీకి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ సీడ్ అండ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఏజెన్సీ (టీఎస్ఎస్‌వోసీఏ)లో కాంట్రాక్ట్ పద్ధతి లో ఉద్యోగం కల్పించింది. ఎల్‌బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం అనంతరం ఆమెకు సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రాజెక్టు మేనేజర్‌గా ఉద్యోగం కల్పించింది. నెలకు రూ.50 వేల వేతనం ఇవ్వనున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.




## ప్లాస్టిక్ వ్యర్థాలతో టైల్స్ తయారీ

పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్న ప్లాస్టిక్ సమస్యను పరిష్కరించేందుకు కర్నాటకలోని ఓ ప్రైవేట్ సంస్థ ప్రయత్నిస్తోంది. మైసూర్ మునిసిపల్ కార్పొరేషన్ సహాయంతో, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్‌లను రీసైకిల్ చేసి పర్యావరణ అనుకూలమైన టైల్స్‌గా తయారు చేస్తున్నారు. మైసూర్‌లోని విద్యారణ్యపురంలో జాగృతి టెక్ పరిశ్రమను ప్రారంభించింది. ఈ ప్లాస్టిక్ టైల్స్ సిమెంట్ టైల్స్ కంటే చౌకగా మన్నికైనవి అని జాగ్రిత్ టెక్ డైరెక్టర్ దినేష్ తెలిపారు.

# ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ రివ్యూ

నితిన్ హీరోగా నటించిన సినిమా "ఎక్స్ట్రా ర్డినరీ మ్యాన్". దర్శకుడు వక్కంతం వంశీ ఈ సినిమాని తెరకెక్కించారు. కాగా ఈ చిత్రం ఈ రోజు విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఈ చిత్రం ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం!




కథ: అభి (నితిన్) ఒక జూనియర్ ఆర్టిస్ట్. నటుడిగా పేరు తెచ్చుకోవాలని, హీరో కావాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. కానీ నటుడిగా ఎప్పుడూ వెనకే మిగిలిపోతాడు. ఇలా ఎక్స్ట్రా ఆర్టిస్ట్ గా మిగిలిన అభి జీవితంలోకి మెరుపులా లిఖిత (శ్రీలీల) ఎంటర్ అవుతుంది. అభితో లిఖిత ప్రేమలో పడుతుంది. ఇక అంతా హ్యాపీ అనుకుంటున్న అభికి అనుకోకుండా హీరో ఛాన్స్ వస్తుంది. ఆ తర్వాత జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో అభి, సైతాన్ పాత్రలో ఇన్ వాల్వ్ అవుతాడు. అసలు ఈ సైతాన్ ఎవరు ?, ఎందుకు అభి సైతాన్ లా మారాడు ?, ఈ మధ్యలో ఐజీ విజయ్ చక్రవర్తి (రాజశేఖర్) పాత్ర ఏమిటి ?, చివరికి అభి కథ ఎలాంటి మలుపు తీసుకుంది ? అనేది మిగిలిన కథ.

ప్లస్ పాయింట్స్: జూనియర్ ఆర్టిస్ట్ రియల్ లైఫ్ లో హీరోగా మారే క్రమంలో వచ్చే డ్రామాలోని కామెడీ సీన్స్, యాక్షన్ సీన్స్ మరియు ఇంటర్వెల్ సీక్వెన్స్ బాగున్నాయి. అలాగే సినిమాలో వినోదంతో పాటు కొన్ని ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో హీరోగా నటించిన నితిన్ తన నటనతో, తన బాడీ లాంగ్వేజ్ తో మరియు యాక్షన్ సీక్వెన్స్ స్ లో చాలా బాగా నటించాడు. అలాగే క్లిష్టమైన కొన్ని కీలక సన్నివేశాల్లో కూడా నితిన్ నటన సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సినిమాలో మరో కీలకమైన పాత్రలో నటించిన డా. రాజశేఖర్ కూడా తన పాత్రకి పూర్తి న్యాయం చేశారు. కాకపోతే ఆ పాత్ర నిడివే కాదు, ప్రాధాన్యత కూడా తక్కువే. కానీ, రాజశేఖర్ ఆకటుకున్నారు. హీరోయిన్ శ్రీలీల తన గ్లామర్ తో అలరించింది. హీరోకి తండ్రికి నటించిన రావు రమేష్ చాలా బాగా నటించాడు. ఆయన మేనరిజమ్స్ బాగున్నాయి. నితిన్ – రావు రమేష్ మధ్య వచ్చే పంచ్ లు అండ్ కామెడీ టైమింగ్ కూడా అలరిస్తోంది. సుదేవ్ నాయర్, రోహిణి, సంపత్ రాజ్, బ్రహ్మాజీలు కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. అలాగే ఇతర పాత్రల్లో కనిపించిన మిగిలిన నటీనటులు కూడా తమ పరిధి మేరకు బాగా నటించారు. ఇక ఈ సినిమాలో హీరో పాత్ర.. ఆ పాత్రకు సంబంధించిన యాక్టింగ్ ట్రాక్.. అలాగే ఆ యాక్టింగ్ తో ముడి పడిన సీన్స్.. మరియు విలన్ తో పాటు మిగిలిన పాత్రలు.. మొత్తానికి ఈ సినిమాలో కొన్ని కామెడీ అంశాలు మెప్పించాయి.

మైనస్ పాయింట్స్: సినిమా మెయిన్ పాయింట్ లో మ్యాటర్ ఉన్నప్పటికీ.. ఆ పాయింట్ కి తగ్గట్టు స్క్రీన్ ప్లే రాసుకోవడంలో దర్శకుడు వక్కంతం వంశీ కొన్ని చోట్ల తడబడ్డాడు. అసలు ఇలాంటి కాన్సెప్ట్ తీసుకున్నప్పుడు ఆ కాన్సెప్ట్ కి తగ్గట్టు సినిమాని ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తిస్తూ ప్లే ఫుల్ ఫన్ తో సాగితే బాగుండేది. కానీ, ఫస్ట్ హాఫ్ లో ఉన్న ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ సెకండ్ హాఫ్ లో మిస్ అయ్యాయి. ఫస్ట్ హాఫ్ కంటే సెకండ్ హాఫ్ గ్రాఫ్ పెరగాలి కానీ, తగ్గకూడదు. కానీ ఈ సినిమాలో సెకండ్ హాఫ్ ఆశించిన స్థాయిలో లేదు. హీరో రైజ్ కోసం విలన్ సిల్లీ ప్లాన్స్ వేయడం కూడా బాగాలేదు. ఈ క్రమంలో వచ్చే కొన్ని సన్నివేశాలు పేలవంగా సాగుతాయి. దీనికితోడు లాజిక్స్ కూడా ఎక్కడా కనిపించవు. అలాగే హీరోహీరోయిన్ల మధ్య ప్రేమకు సంబంధించిన ట్రాక్ కు కూడా సరైన బలం లేదు. అసలు ఈ కథలో ఫుల్ కామెడీని మెయింటైన్ చేయవచ్చు. ఫస్ట్ హాఫ్ నిజంగానే ఫన్ తో సాగింది. ఆ ఫన్ ను కూడా దర్శకుడు సెకండ్ హాఫ్ లో కంటిన్యూ చేయలేకపోయాడు.

సాంకేతిక విభాగం: టెక్నికల్ గా చూసుకుంటే.. సినిమాలో సాంకేతిక విభాగం వర్క్ బాగానే ఉంది. ముఖ్యంగా హారిస్ జయరాజ్ సంగీతం సినిమాకు బాగా ప్లస్ అయింది. అదే విధంగా ఆర్థర్ ఏ విల్సన్ ఐ ఏఎస్ సి, యువరాజ్ జే, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ వర్క్ కూడా సినిమాకి హైలైట్ గా నిలిచింది. ఎడిటర్ ప్రవీణ్ పూడి ఎడిటింగ్ సినిమాకి తగ్గట్టు ఉంది. ఇక ఈ సినిమాలో నిర్మాతలు ఎన్. సుధాకర్ రెడ్డి, నికితారెడ్డి పాటించిన ప్రొడక్షన్ వాల్యూస్ చాలా బాగున్నాయి.

తీర్పు: ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ అంటూ వచ్చిన ఈ చిత్రంలో మెయిన్ కాన్సెప్ట్, జూనియర్ ఆర్టిస్ట్ ట్రాక్, మరియు కామెడీ అండ్ యాక్షన్ సీన్స్ బాగున్నాయి. అలాగే, కొన్ని ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా పర్వాలేదనిపిస్తాయి. అయితే, ఇంట్రెస్టింగ్ గా సాగని ట్రీట్మెంట్ తో పాటు మెయిన్ క్యారెక్టైజేషన్స్ బలహీనంగా ఉండటం, పైగా సెకండ్ హాఫ్ ఆశించిన స్థాయిలో లేకపోవడం వంటి అంశాలు సినిమా ఫలితాన్ని దెబ్బ తీశాయి. ఐతే, నితిన్ నటన, రాజశేఖర్ గెస్ట్ అప్పియరెన్స్ సినిమాకు ప్లస్ అయ్యాయి. ఓవరాల్ గా ఈ చిత్రం ఓ వర్గం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.



## మహిళలకు ఉచిత ప్రయాణంపై మార్గదర్శకాలు..! ఎలాంటి షరతులు వర్తిస్తాయంటే..

తెలంగాణ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీల అమలుపై ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని డిసెంబర్ 9నుంచే ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్ఆర్‌టిసి) సజావుగా అమలు చేయడానికి రంగం సిద్ధం చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే టిఎస్ఆర్‌టిసి సంస్థ ఆపరేషన్స్ ఈడీ మునిశేఖర్ నేతృత్వంలో అధికారుల బృందం గురువారం హుటాహుటిన కర్ణాటకకు వెళ్లింది. కర్ణాటక రాష్ట్రంలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అమలుతీరు, సంస్థపై ఆర్థిక ప్రభావం, ప్రభుత్వం నుంచి అందే ఆర్థికసాయం తదితర వివరాలను అక్కడి అధికారులతో చర్చించి అన్ని విషయాలను తెలుసుకున్నారు. అనంతరం వారు సేకరించిన ప్రాథమిక సమాచారమంతా సంస్థ ఎండీ సజ్జనార్‌కు అందించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సజ్జనార్ భేటీ అనంతరం మహిళలకు ఉచిత ప్రయాణంపై మార్గదర్శకాలు వెల్లడించే అవకాశం ఉంది. ఇకపోతే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో టిఎస్ఆర్‌టిసి ఎండీ సజ్జనార్ భేటీ అనంతరం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మార్గదర్శకాలతో కూడిన స్పష్టమైన ప్రకటన వెలువడనుంది. ఏఏ బస్సుల్లో మహిళలను అనుమతిస్తారు, ప్రయాణ పరిధి ఎంత వరకు నియమిస్తారు అన్నది తెలియనుంది. అలాగే, ప్రయాణించే వారు ఏఏ గుర్తింపు కార్డులు చూపించాల్సి ఉంటుంది తదితరాలను మార్గదర్శకాల్లో వెల్లడిస్తారు. తెలంగాణ ఆర్టీసీ నిత్యం 12-13 లక్షల కిలోమీటర్ల మేర బస్సుల్ని నడుపుతోంది. సగటున రోజుకు రూ.14 కోట్ల రాబడి వస్తోంది.








## యష్ కొత్త సినిమా టాక్సిక్

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటించిన గత చిత్రాలు కేజీయఫ్ సిరీస్ హిట్ అయ్యిన తర్వాత తన నెక్స్ట్ ప్రాజెక్ట్ ఏంటి ఎవరితో అనేది చాలా కాలం సస్పెన్స్ గానే ఉంది. మరి ఈ చిత్రం మోస్ట్ అవైటెడ్ గా మారిన ఈ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ పై మేకర్స్ ఇప్పుడు సాలిడ్ అనౌన్సమెంట్ తో భారీ అప్డేట్ రివీల్ చేశారు. ఈ చిత్రం టైటిల్ సహా రిలీజ్ డేట్ ని కూడా లాక్ చేసేసి ఫ్యాన్స్ కి అదిరే ట్రీట్ ఇచ్చారు. ఇక ఈ భారీ చిత్రంపై ఓ ఇంట్రెస్టింగ్ టైటిల్ టీజర్ ని స్టన్నింగ్ బ్యాక్గ్రౌండ్ స్కోర్ తో రివీల్ చేస్తూ ఈ సినిమా టైటిల్ ని "టాక్సిక్" అంటూ రివీల్ చేయగా ఇందులో యష్ లుక్ కూడా ఎలా ఉంటుంది అనేది హింట్ ఇచ్చారు. ఇక ఈ చిత్రానికి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించనుండగా ఈ సినిమా వరల్డ్ వైడ్ గా 2025 ఏప్రిల్ 10న రిలీజ్ కాబోతున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. దీనితో యష్ ఫ్యాన్స్ అప్పటి వరకు ఆగాల్సిందే అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి కే వి ఎన్ ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహిస్తుండగా పాన్ ఇండియా లెవెల్లో ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది.

## దేశంలో 12.5% పెరిగిన గుండెపోటు మరణాలు..

### ఎన్‌సీఆర్‌బీ నివేదిక



2021తో పోలిస్తే 2022లో గుండెపోటు మరణాలు 12.5 శాతం పెరిగాయని ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. 2022లో 32,547 మంది గుండె పోటు కారణంగా మరణించారని తెలిపింది. కొవిడ్ వ్యాధి వల్ల గుండె పనితీరు బలహీనంగా ఉండటం ఈ మరణాలకు ఒక కారణమని చెప్పింది. 2022లో 56,450 హఠాత్తు మరణాలు సంభవించాయని, ఆ ఏడాదికి ముందు మూడేండ్లతో పోలిస్తే హఠాత్తు మరణాల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తున్నదని తెలిపింది. హింస వల్ల కాకుండా ఇతర ఏ కారణాల వల్లనైనా(ఉదాహరణకు గుండెపోటు, మెదడులో రక్తస్రావం) నిమిషాల వ్యవధిలో మరణం సంభవిస్తే ఆ మరణాన్ని హఠాత్తు మరణంగా పరిగణిస్తామని తెలిపింది.

## దిశా పటానీ అందాల జాతర..

దిశా పటానీ విషయానికొస్తే.. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'లోఫర్' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైంది. ఈ సినిమా చూసినపుడు ఎవరూ అనుకోలేదు ఈ భామ బాలీవుడ్ టాప్ హీరోయిన్ అవుతుందని.. అంతేకాదు ఎప్పటి కపుడు సోషల్ మీడియాలో హాట్ ఫోటోలతో రెచ్చిపోవడం ఈ భామకు అలవాటైయింది. లేటెస్ట్‌గా కొన్ని ఫోటోలను పంచుకుంది. ఇక ఈ ఫోటోలపై నెటిజన్స్ రకరకాలుగా స్పందిస్తున్నారు. ప్రస్తుతం అవి వైరల్ అవుతున్నాయి.